# రేవతి నుంచి... తల్లుల ప్రేమ

సీతా!

యివాళ పొరుగింటామెతో పోట్లాడాను.

మధ్యాహ్నం పన్నెండున్నర అవుతుంది. పొరుగింటి నుంచి బిడ్డ ఏడ్పు వినవస్తోంది. 'అదేమా?' అని వింటే బిడ్డను పట్టుకొని ఎవరో బాదుతున్నట్టు తెలిసింది. వాళ్ళు నెల్నాళ్ళయి ఆ యింట్లో ప్రవేశించారు. ఆమె ఒకటి రెండుసార్లు కరివేపాకుకనీ, ఆవాలుకనీ అప్పు పెట్టమంటూ మా యింటికి వచ్చింది – అదీ పరిచయం. అంతకుముందు ఆమె బిడ్డలను బాదటం చాలాసార్లు విన్నాను. రోజుకు కనీసం రెండుసార్లయినా ఆ యింట్లో నుండి బిడ్డల యేడ్పు వినవస్తుంది. చాలాసార్లు నాకు కోపం వచ్చింది. యీసారి అణుచుకోలేక సరాసరి వాళ్ళింటికి వెళ్ళిపడ్డాను.

కారణం యిదీ–

ఆమెగారేమో పడుకుందట. ఆ బిడ్డ పాటలు పాడుతూ ఆమెకు నిద్ర పట్టకుండా అల్లరిచేస్తోందట.

"పగలు నిద్ర యేం– రోగం" అని అడిగాను.

రాత్రంతా నల్లులు నిద్ర పట్టనిచ్చాయి కావట.

నాకు చాలా చిరాకెత్తింది.

రాత్రంతా నిద్ర పట్టనీయకుండా నల్లులు కుట్టి బాధిస్తే గొడ్డులా భరిస్తుంది. దోమలు చెవి దగ్గర చేరి గీ పెడుతూ నిద్ర పట్టనీయకపోతే నోరు మూసుక పడి వూరుకుంటుంది. భర్త నిద్దర పట్టనీయకపోయినా కుక్కిన పేనల్లే పడి వూరుకుంటుంది.

–కానీ, పగలు బిడ్డ ఆడుకుంటూ, పాడుకుంటూ నిద్రాభంగం చేస్తోందని వీపు వాయకొడుతుందీ అవ్వర్థురాలు!

–యిదే పొరుగింటి వారమ్మాయి యెవరైనా, సంగీతం సాధన చేస్తుండి వుంటే యేంచేసి వుండేదో? మాటాడితే 'చెమ్డా' ఊడగొడతారు. అది తన బిడ్డ గాబట్టి – అశక్తురాలు కాబట్టి – పట్టి, చిదుగబాదుతోంది.

యీమెకే కాదు – యీ దరిద్రపు రోగం మన వాళ్ళల్లో చాలామందికి వుంది. ఆడవారికీ, మగవారికీ కూడా.

వాళ్ళకు కొంచం కూడా జ్ఞానముండదేమో అనిపిస్తుంది.

'పిల్లలు పెద్దవారి నిద్ర పాడుచెయ్యాలనే వుద్దేశంతోనే అల్లరి చేస్తుంటారు–' అనుకునే మూర్ఖులుంటారా?

మరి వాళ్ళు ఉద్దేశపూర్వకంగా వీరి నిద్దర పాడుచెయ్యనప్పుడు వాళ్ళ మీద ఆ కోపమెందుకు?

వాళ్ళను బోధచేసి సన్మార్గంలో పెట్టడం చేతకాక వాళ్ళను బాదుతారు. ఒకసారి బాదిన తర్వాత ఆ పసిపిల్లలు మానేస్తారేమో అంటే – అదీ వుండదు! యెలా మానుతారు? – అది వాళ్ళ సహజమయ్యె! ఆ సహజ గుణం పెద్దవారి అసహజపు అలవాట్లకు బాధాకరమైనప్పుడు పెద్దవారు తమ అసహజపు అలవాట్లను విడిచిపెట్టుకొనడం న్యాయం. బలహీనులయి చేతకాకపోతే అప్పుడు పిల్లల అలవాట్లయినా మానిపించాలి.

ఇపుడామె తన నిద్రాభంగమయిందని బిడ్డను బాదింది. అందువల్ల ఆమె నిద్ర తీరిందా? అదే ఆమె భర్త అయితే? అదే పొరుగు వారయితే?

నోరులేంది కదా – తిరగబడలేదు కదా – అనువుగా దొరికిందికదా – అని బిడ్డను పట్టుకొని బాదేయగలిగింది.

వెనుక యేదో ఒక దేశం పరిపాలన గూర్చి చదువుతూ ఆ దేశంలో బిడ్డల గూర్చి చదివాను. తమ పిల్లలను తల్లిదండ్రులు కొడితే పోలీస్ రిపోర్టు యిస్తారట పిల్లలు.

యింక మన దేశంలో –

యేమైనా అంటిమా "నా బిడ్డను నేను కొట్టుకుంటాను నీకెందుకు'' అంటుంది – 'నా కొంప నేను అంటించుకుంటాను నీకెందుకు' అనే మూర్ఖుల్లా!

లేదా–

"నా బిడ్డ మంచి చెడ్డలు నాకు తెలుసు – నా బిడ్డ మీద నాకు ప్రేమలేదా?" అంటారు.

బిడ్డ ఆనందంగా పాడుకుంటూ వుంటే నిద్రాభంగమయిందంటూ వుగ్రురాలు అయ్యే తల్లులు – బిడ్డ ఆనందం కోసరం పగటి నిద్ర – పాడునిద్ర – త్యాగం చెయ్యలేకపోయిన తల్లులు – బిడ్డ అర్ధరాత్రప్పుడు ఆకలయ్యో, చీమ కుట్టో ఏడిస్తే, కారణం ఏమిటో తెలుసుకోడానికయినా ప్రయత్నించకుండా, "కాల్చుకు తింటోంది" అంటూ విసుక్కునే తల్లులు. – వీరికట బిడ్డల మీద ప్రేమేనట!! ఆ బుగ్గపోట్లూ, ఆ బొబ్బట్లు, ఆ తొడపాశాలూ, ఆ మొట్టికాయలూ, ఆ శాపనార్థాలూ, ఆ తిట్లూ, ఆ కసుర్లూ, అవన్నీ బిడ్డల మీద తమకు గల ప్రేమకు చిహ్నాలేనేమో?

నవమాసాలూ మోసి, కని, పెంచారట!

ఎవళ్ళ కోసరం?

బిడ్డ మీద అభిమానం చేతేనా? చెప్పమను – గుండెల మీద చెయ్య వేసుక చెప్పమను. విధికి లోబడి కాదా? ప్రకృతి లోబడి కాదా?

దేశం యెప్పుడు మారుతుందో తెలియదు. స్వతంత్రం వచ్చేసిందని వుత్సవాలయితే చేసేసుకున్నాం కాని – మన విజ్ఞానం అభివృద్ధి అయి మానసిక వికాసం ఆరంభమయేవరకూ ఏమి వచ్చినా లాభం లేదు. వుంటాను.

– నీ రేవతి ★

*(చిత్రాంగి: ఏప్రిల్ 1948)*